కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో కూరగాయల ధరలు కిలో రూపాయల్లో..టమాట 50, పచ్చిమిర్చి 60 , బెండ 50, కాకర 40, దొండ 50, దోస 40, ఆలు 30, చామ 50, కీర 30, బీర 50, వంకాయ 70, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 40, క్యాప్సికమ్ 60, క్యాబేజీ 25, క్యారెట్ 60, చిక్కుడు 80, ఉల్లి 30(కేజీ), ములక్కాయలు (1) 10, కాలీఫ్లవర్ (1) 40, సొరకాయ (కేజీ) 40, అల్లం 110, వెల్లుల్లి 150.

బాధ్యతల స్వీకరణ



బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ అనురాగిణి రెడ్డి

గచ్చిబౌలి: రంగారెడ్డి డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ అనురాగిణి రెడ్డి అదనపు బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు డీసీహెచ్‌ఎస్‌గా డాక్టర్ చంద్రశేఖర్ శనివారం పదవీ విరమణ పొందారు. దీంతో చంద్రశేఖర్ నుంచి కొండాపూర్ జిల్లా ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ అనురాగిణి రెడ్డికి డీసీహెచ్‌ఎస్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. కొండాపూర్ హాస్పిటల్‌తో పాటు వనస్థలిపురం ఏరియా ఆస్పత్రి, చేవెళ్ల, హయత్‌నగర్, మహేశ్వరం, యాచారం, ఇబ్రాహింపట్నం, రాజేంద్రనగర్, శంషాబాద్, షాద్‌నగర్, ఆమన్‌గల్ హెల్త్ సెంటర్లను ఆమె పర్యవేక్షించనున్నారు.

జనఔషధిలో తక్కువ ధరకు మాత్రలు

ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు: పేద, మధ్యతరగతి ప్రజల కోసం ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన జన ఔషధి స్టోర్‌లో తక్కువ ధరకే మాత్రలు లభిస్తాయని ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి అన్నారు. పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రిలోని జన ఔషధి స్టోర్ నిర్వాహకుడు కృష్ణ మాత్రలు విక్రయాలుతో పాటు, పేదలకు సర్వీస్ చేసిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం అవార్డును అందజేసింది. ఈ నేపథ్యంలో జన ఔషధి స్టోర్ నిర్వాహకుడు కృష్ణను ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రీనివాస్ రెడ్డి, ఆర్‌ఎంఓ ప్రవీణ, ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి, కార్పొరేటర్ మెట్టు కుమార్‌యాదవ్ సన్మానించారు.



ప్రశాంత్‌నగర్ నుంచి ఎంఎనగర్ వెళ్లే రోడ్డుకు అడ్డంగా గుంతలు



మయూరినగర్ కాలనీలో..

అడ్డగోలు తవ్వకాలతో అవస్థలు

అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా రోడ్ల తవ్వకాలు

- కనీస మరమ్మతులు చేయని యంత్రాంగం
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- పట్టించుకోని జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్ అధికారులు

మియాపూర్: ప్రధాన, అంతర్గత రోడ్లను అడ్డంగా తవ్విన గుంతలతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఎక్కడపడితే అక్కడ..ఎలా పడితే అలా రోడ్లను తవ్వివేస్తుండడంతో లక్షలాది రూపాయల ప్రజాధనం వృథా అవ్వడంతో పాటు వాహనదారుల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయి. కాలనీ, బస్తీలలో సీసీ, బీటీ రోడ్లను కొందరు ఇష్టారాజ్యంగా తవ్వేస్తుండడంతో గుంతలు ఏర్పడుతున్నాయి. డ్రైనేజీ, తాగునీరు, పైప్‌లైన్ పనుల కోసం ఇతర అవసరాలకు రోడ్లను ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వి పనులు చేపడుతున్నారు. పనులు పూర్తయ్యాక మరమ్మతులు చేయకుండా వదిలేస్తుండడంతో రోడ్డులో గుంతలు ఏర్పడుతున్నాయి.

తూ.తూ మంత్రంగా మరమ్మతులు..

మియాపూర్ డివిజన్ పరిధిలోని ప్రశాంత్‌నగర్, మయూరినగర్, లక్ష్మీనగర్, బీకేఎన్‌క్లేవ్ న్యూ కాలనీ, ఆదిత్యానగర్, దీప్తి శ్రీనగర్, కృషినగర్, ఎంఎనగర్‌తో పాటు పలు కాలనీల్లో డ్రైనేజీ, తాగునీరు ఇతర అవసరాల కోసం పలువురు జీహెచ్‌ఎంసీ అనుమతులు లేకుండా రోడ్లను అడ్డంగా తవ్వుతున్నారు. పనులు పూర్తయ్యాక ఆ గుంతలకు మరమ్మతులు చేయాల్సి ఉంటుంది. కానీ కొందరు ఆ గుంతలను అలాగే వదిలేస్తున్నారు. మరికొందరు తూ.తూ మంత్రంగా మరమ్మతులు చేపడుతున్నారు. దీంతో మూణ్నాళ్లకే రోడ్డుకు అడ్డంగా పెద్ద పెద్ద గుంతలుగా మారుతున్నాయి.

◆ లక్షల రూపాయల ప్రజాధనం వెచ్చించి నిర్మించిన రోడ్లను ఇలా తవ్వి పాడుచేస్తున్న ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డు ఇలా..

మియాపూర్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో విశ్వేశ్వరయ్య కాలనీ వద్ద రోడ్డు గుంతలమయంగా మారింది. డ్రైనేజీ పైప్‌లైన్ చేపట్టి పనులు పూర్తయ్యాక ఆ గుంతలను అడ్డదిడ్డంగా మరమ్మతులు చేశారు. ఇటీవల కురిసిన వర్షాలకు, వాహనాల రాకపోకలతో రోడ్డంతా కంకర, ఇసుక తేలిపోయి పెద్ద పెద్ద గుంతలు ఏర్పడ్డాయి. ఈ రోడ్డు వెంబడి అధిక సంఖ్యలో వాహనదారులు రాకపోకలు సాగిస్తుంటారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డే ఇలా ఉంటే మిగితా కాలనీ, బస్తీలలో రోడ్ల పరిస్థితి ఏమిటని ప్రజలు ప్రశ్నిస్తున్నారు. వినాయక నవరాత్రులు కావడంతో నిమజ్జనం చేసేందుకు వెళ్లే వాహనదారులు కూడా ఈ రోడ్ల వెంబడి వెళ్తూ రాకపోకలు సాగిస్తుంటారు. ఈ గుంత రోడ్లపై నుంచి వినాయక నిమజ్జన వాహనాలను ఎలా తీసుకువెళ్లాలంటూ ప్రజలు వాపోతున్నారు. కనీసం మరమ్మతులు కూడా చేయకపోవడంపై స్థానిక ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులోని విశ్వేశ్వరయ్య కాలనీ వద్ద..

నృత్యం.. నయనానందకరం

గచ్చిబౌలి: ‘శివోహం..శివోహం’అంటూ కొలుస్తూ కూచిపూడి నృత్యప్రదర్శన చేసి సందర్శకులను విశేషంగా మద్దిరాల కేతనరెడ్డి ఆకట్టుకుంది. గణేష్ ఉత్సవాల్లో భాగంగా కొండాపూర్‌లోని ఎస్‌ఎంఆర్ వినయ్ ఐకానియాలో నృత్య ప్రదర్శనను నిర్వహించారు. కూచిపూడి నృత్యాన్ని తనదైన శైలిలో శివుడిని కొలుస్తూ ఆటకు అనుగుణంగా చేస్తూ అందరి ప్రశంసలు పొందడం విశేషం.

మైత్రీనగర్ ఫేజ్–2లో..

చందానగర్: హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని మైత్రీనగర్ ఫేజ్–2లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మైత్రీనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం ప్రముఖ కూచిపూడి నృత్య కళాకారిణి ఉషా గోటేటి శిష్య బృందంచే ప్రదర్శన నిర్వహించారు. చిన్నారులు గణపతిని స్తుతించే ఎన్నో అద్భుత కృతులను చేశారు. ఉషా గోటేటి అమెరికాలో ఉన్నా ఆమె శిష్య బృందం అంకితభావంతో కూచిపూడి నృత్యాలు చేసి అందరిని ఆకట్టుకుంటున్నారు.

శిల్పారామంలో..

మాదాపూర్: మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహించే వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా శనివారం చెన్నై నుంచి వచ్చిన కూచిపూడి నాట్య కళాకారుడు దిలీప్ తన ప్రదర్శనలో శివస్తుతి, రాధికా కృష్ణ అష్టపది, ఆనంద తాండవం అంశాలను ప్రదర్శించి మెప్పించారు. మానస స్కూల్ ఆఫ్ డాన్స్ గురు ప్రణవి తుమ్మాటి శిష్య బృందం కూచిపూడి ప్రదర్శనలో అంబపరకు, వినాయక కౌతం, గణేశా పంచ రత్నం, మూషిక వాహన, బ్రహ్మాంజలి, ముద్దుగారేయ్ యశోద, ఇదిగో భద్రాద్రి, ప్లేట్ పై నృత్యం, కుండపై నృత్యం , కృష్ణ శబ్దం అంశాలను రెయాన్స్, నాగ మానస, సహస్ర, పూర్వీక, సాయి అధ్య, గాయత్రీ, చక్రికా, హిమబిందు, దీపాంవిత, రిషిక మొదలైన వారు ప్రదర్శించి మెప్పించారు.



ఎస్‌ఎంఆర్ వినయ్‌ఐకానియాలో..



హఫీజ్‌పేట్ వేంకటేశ్వర స్వామి ఆలయంలో..



శిల్పారామంలో కూచిపూడి నృత్య ప్రదర్శన

అలరించిన సంకీర్తనలాపన

మాదాపూర్: మాదాపూర్‌లోని అన్నమయ్యపురంలో నిర్వహించే అన్నమాస్వారార్చన కార్యక్రమంలో భాగంగా శనివారం మనోహరంగా కళాకారిణి పద్మశ్రీ సంకీర్తనాలాపన చేసి సందర్శకులను అలరించారు. పద్మశ్రీ పురస్కార గ్రహీత డాక్టర్ శోభారాజు ఆధ్వర్యంలో అన్నమాచార్య భావనా వాహిని విద్యార్థిని పద్మశ్రీ, ఆదిపురుషా, భజరే రామనామం, చిత్తము, నామనసే తిరుపతి, కంటి అఖిలాండ, ఇంత చక్కని, నారాయణతే నమో నమో వంటి బహుళ ప్రాచుర్యం పొందిన కీర్తనలను సుమనోహరంగా ఆలపించారు. కీబోర్డ్ శ్రీనివాస్, తబలా అజేయ్ సహకారం అందించారు. తదనంతరం కళాకారులను సంస్థ మేనేజింగ్ ట్రస్టీ డాక్టర్ నందకుమార్ జ్ఞాపికను అందించారు.



అన్నమయ్యపురంలో సంకీర్తనలాపన చేసిన కళాకారిణి పద్మశ్రీ

మహనీయుల చరిత్రను తెలియజేయాలి



కార్యక్రమంలో మాట్లాడుతున్న సింధురెడ్డి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చిన్నారులకు చిన్ననాటి నుంచే మహనీయుల చరిత్రను తెలియజేయాలని భారతినగర్ డివిజన్ కార్పొరేటర్ వి.సింధురెడ్డి సూచించారు. భెల్ కాలనీలోని జ్యోతి విద్యాలయ పాఠశాలలో భారతీ వికాస్ పరిషత్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన నేషనల్ గ్రూప్ సాంగ్ పోటీలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. భారతీ వికాస్ ఆధ్వర్యంలో సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుతూ విద్యార్థులలో దేశభక్తిని పెంపొందించేందుకు కార్యక్రమాలను నిర్వహిస్తుండటం హర్షణీయమన్నారు.

బోదకాలు వ్యాధిపై అవగాహన

పటాన్‌చెరు టౌన్: బోదకాలు వ్యాధిపై అవగాహన పెంచుకోవాలని ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ మౌనిక, డాక్టర్ శశికర్ అన్నారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని భాగ్య హెల్త్ క్లబ్, జాతీయ కీటక జనిత రోగ నియంత్రణ సంయుక్తంగా బోధవ్యాధి లింఫాటిక్ ఫైలేరియాసిస్‌పై అవగాహన కల్పించారు.. ముఖ్యఅతిథుగా వక్తలు డాక్టర్ మౌనిక, డాక్టర్ శశికర్ హాజరై బోదకాలు వ్యాధిపై అవగాహన కల్పించారు.



సాయివైభవ్ కాలనీలో..ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, స్థానికులు



రాయదుర్గంలోని పెద్ద సమాజంలో..

వక్రతుండాయ వందనం

శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలోని అన్ని ప్రాంతాల్లో గణపతి నవరాత్రి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. వాడవాడల్లో ఏర్పాటు చేసిన గణనాథుడి మండపాల్లో శనివారం భక్తులు ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. పలు ప్రాంతాల్లో మండపాల నిర్వాహకులు అన్నదానాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక ప్రజా ప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, ప్రజలు గణనాథుడి మండపాల వద్ద వెళ్లి వినాయకుడిని దర్శించుకున్నారు. పలు ప్రాంతాల్లో గణపతి విగ్రహాలను నిమజ్జనం చేశారు.


– శేరిలింగంపల్లి జోన్ బృందం



నల్లగండ్ల అపర్ణ గ్రాండే గేటెడ్ కమ్యూనిటీలో..



గిరిజా మార్వెల్‌లో 108 ప్రసాదాలు నైవేద్యంగా సమర్పించిన భక్తులు



ఇందిరా నగర్‌లోని ఆంజనేయ స్వామి ఆలయంలో..



చందానగర్‌లోని గంగారం సుభాష్‌నగర్‌లో..



మల్కంచెరువు గణేష్ నిమజ్జన కోనేరు వద్ద.. నాగార్జున ఉన్నత పాఠశాల విద్యార్థులు



గోపన్‌పల్లిలోని బస్తీలో..



సిటిజన్‌కాలనీలో..



గచ్చిబౌలిలోని ‘ఎస్వీ’లో..

సందడిగా ఇన్వెస్టిచర్ వేడుక

గచ్చిబౌలి: 26వ ఇన్వెస్టిచర్ వేడుకలను గచ్చిబౌలిలోని నాసర్ బాయ్స్ స్కూల్‌లో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన ప్రదర్శనలు అందరినీ ఆకట్టుకున్నాయి. 2025–26 విద్యా సంవత్సరానికి ఎన్నికైన స్టూడెంట్ కౌన్సిల్ సభ్యుల ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని వైభవంగా నిర్వభహించారు. నాసర్ బాయ్స్ స్కూల్ ప్రిన్సిపాల్ మీర్ అహ్మద్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తెలంగాణ, ఆంధ్ర సబ్ ఏరియా (టీఏఎస్ఏ) జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థుల నుంచి గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..విద్యతో పాటు ప్రతిఒక్కరూ వ్యక్తిత్వ వికాసానికి ప్రాధాన్యమివ్వాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు బ్యాడ్జీలను అతిథి చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు, పాఠశాల యాజమాన్య ప్రతినిధులు పాల్గొన్నారు.



అజయ్ మిశ్రా గౌరవ వందనం సమర్పిస్తున్న విద్యార్థులు

తెలుగువారికి గర్వకారణం: బండి సంజయ్

మాదాపూర్: సినీ నటుడు నందమూరి బాలకృష్ణ వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడం తెలుగు వారికి గర్వకారణమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ అన్నారు. మాదాపూర్‌లోని ట్రైడెంట్ హోటల్‌లో శనివారం వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో చోటు దక్కించుకోవడంపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన బండి సంజయ్ మాట్లాడుతూ బాలకృష్ణ నటన బావుంటుందని కొనియాడారు.

◆ బసవతారకం కేన్సర్ హాస్పిటల్ ద్వారా సేవలందించడం గొప్ప విషయమన్నారు. నందమూరి బాలకృష్ణ మాట్లాడుతూ అభిమానుల ప్రేమవల్లే తాను ఇంతస్థాయికి చేరుకున్నానని చెప్పారు. చిత్రసీమకు చేసిన సేవకు గాను ఈ గుర్తింపు రావడం సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో వరల్డ్ బుక్ ఆఫ్ లండన్ సీఈవో సంతోష్ శుక్లా, జాయింట్ సెక్రటరీ ఓలా, ఉస్మాన్, సహజ నటి జయసుధ, ఎఫ్‌డీసీ చైర్మన్ దిల్ రాజు, దర్శకుడు గోపీచంద్ మలినేని, నిర్మాత సురేష్‌బాబు, దర్శకుడు బోయపాటి శ్రీను, బాబీ, సంగీత దర్శకుడు తమన్, నందమూరి మోహన కృష్ణ, దగ్గుపాటి వేంకటేశ్వరరావు, ఫిల్మ్ చాంబర్ కౌన్సిల్ కార్యదర్శి ప్రసన్న, మైత్రి నవీన్, నాగవంశీ, ఏషియన్ సునీల్, 14 రీల్స్ రామ్ ఆచంట, గోపి ఆచంట, భరత్ భూషణ్ తదితరులు పాల్గొన్నారు.

ఆదమరిస్తే ప్రమాదమే..

మియాపూర్: ప్రధాన రహదారిలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మూతలు పగిలిపోయి ప్రమాదకరంగా మారాయి. మియాపూర్ డివిజన్ పరిధిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ ధ్వంసమై ప్రమాదకరంగా దర్శనమిస్తుంది. అసలే వర్షాకాలం చిన్నపాటి చినుకు పడితే కాంక్రీట్ మైదానంలో ఉన్న కాలనీల్లో వర్షపు నీరు వరదలై పారుతు ఉంటుంది. ఎక్కడ ఏ మ్యాన్‌హోల్ మూత నోరుతెరుచుకుని ఉందో తెలియని పరిస్థితి. ప్రధాన రహదారిలో మ్యాన్‌హోళ్ల మూతలు పగిలిపోయి, ధ్వంసమై ఉండడంతో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, వాహనదారులు భయాందోళన చెందుతున్నారు. రాత్రివేళలో అటుగా వెళ్లే వాహనదారులు ధ్వంసమైన మ్యాన్‌హోళ్లు కనిపించక ఎక్కడ ప్రమాదాల బారిన పడుతారోనని భయాందోళన చెందుతున్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకుని అధికారులు స్పందించి నాణ్యమైన, పటిష్టమైన మ్యాన్‌హోల్ మూతలను ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్

ఆకట్టుకున్న ‘నామ సంకీర్తన’

సాక్షి, సిటీబ్యూరో: గణేష్ ఉత్సవ వేడుకల్లో భాగంగా శుక్రవారం కోహినూర్ ఉత్సవ కమిటీ, హోప్ అడ్వర్టైజింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ప్రఖ్యాత గాయకుడు జె.ఎస్. శ్రీరామ్, అతని బృందం నేతృత్వంలో ఆధ్యాత్మిక భక్తి సంగీత కార్యక్రమం ‘నామ సంకీర్తన’ను నిర్వహించింది. రెండు గంటల పాటు సాగిన ఈ సంగీత కచేరీలో శ్రీరామ్, అతని బృందం కోహినూర్ వాసులను ఆధ్యాత్మిక సంగీత ప్రపంచంలోనికి తీసుకెళ్లింది. శ్రీరామ్‌కు సుభాష్, సుధాంశు, విఘ్నేష్, సాయి శ్రావణి జొన్నలగడ్డ, శ్రీనిధి, విష్ణుప్రియ, అపర్ణ సహకార గాత్రం అందించగా..హార్మోనియంపై కన్నెపల్లి శ్రీకర్, మృదంగంపై భార్గవ్ కస్తూరి, తబలాపై సాయి రాఘవచరణ్ చెప్పల్లి వాయిద్య సహకారం అందించారు. ఈ సందర్భంగా మహీధర సీతారాం మాట్లాడుతూ..రెండు తెలుగు రాష్ట్రాల నుంచి నామ సంకీర్తన, కర్ణాటక సంగీత గాత్రం, నృత్య సంకీర్తనాలాపన ఈ మూడింటినీ సమర్థవంతంగా ప్రదర్శించే ఏకైక కళాకారుడు జె.ఎస్. శ్రీరామ్ అని, ఆయన కళలోని ప్రత్యేక ప్రతిభను గుర్చి కొనియాడారు.

